నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ గురువారం 30 మే 2024 | ADILABAD NIRMAL




# అంగరంగ వైభవంగా గోదారి హారతి



గోదారమ్మకు హారతి ఇస్తున్న వేద పండితులు


బాసర, మే 29 : ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన సరస్వతీ అమ్మవారి కొలువుదీరిన బాసరలో బుధవారం గోదావరి ఘాట్-1 వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ వైదిక బృందం సభ్యులు గంగాహారతి నిర్వహించారు. ఆలయ వైదిక బృందం ప్రత్యేక మంత్రోచ్ఛారణల మధ్య గోదారమ్మకు హారతి కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి బుధవారం సాయంత్రం గంగా హారతి నిర్వహిస్తున్నామని ఆలయ అధికారులు తెలిపారు.

# వైభవ చిహ్నాలపై కాంగ్రెస్ కుట్ర

## కాకతీయ కళాతోరణం, చార్మినార్ గుర్తులను తొలగించే చర్య!

### తెలంగాణ గుర్తింపునకే విఘాతం కలిగించే అంశం

### రాష్ట్ర ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న విమర్శలు




**పోరాడి సాధించుకున్న** తెలంగాణలో చరిత్రాత్మక ఆనవాళ్లయిన చార్మినార్, కాకతీయుల కళాతోరణం వంటి గుర్తులతో రూపొందించిన తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడంపై తెలంగాణ ఉద్యమకారులు, కవులు, కళాకారుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ దురుద్దేశంతోనే తొలగించి ఇష్టానుసారంగా రాష్ట్ర చిహ్నాన్ని సీఎం రేవంత్‌రెడ్డి రూపొందించడం సరికాదంటున్నారు. సంస్కృతి, చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న వాటికి ప్రాధాన్యమిచ్చి కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర చిహ్నంలో స్థానం కల్పించింది. ఈ చిహ్నానికి ఎంతో గుర్తింపు వచ్చింది. ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే రేవంత్‌రెడ్డి చిహ్నాన్ని మార్చడం తెలంగాణ చరిత్రకే మాయని మచ్చగా మిగులుతున్నది. ప్రజల దృష్టిని మరల్చడానికే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

*- ఆదిలాబాద్/నిర్మల్, మే 29(నమస్తే తెలంగాణ)*



పనులను పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

# ఏకరూప దుస్తుల తయారీని వేగవంతం చేయాలి

సోన్, మే 29 : ఏకరూప దుస్తుల తయారీని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని మంజులాపూర్‌లో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తుల తయారు చేస్తున్న టైలరింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియ అత్యంత నాణ్యతగా చేయాలని ఆదేశించారు. విద్యార్థుల నుంచి తీసుకున్న కొలతల ప్రకారమే దుస్తులను సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం సిద్ధాపూర్ ప్రభుత్వ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. పెండింగ్ పనులు జూన్ 5వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. సోన్ మండలంలోని న్యూవెల్మల్‌లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా పీడీ సుభాష్, పంచాయతీ రాజ్ ఈఈ శంకరయ్య పాల్గొన్నారు.

# స్టిచ్చింగ్ పూర్తి చేయాలి..

### ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 29 : వచ్చే నెల 6వ తేదీలోగా విద్యార్థులకు ఏకరూప దుస్తుల స్టిచ్చింగ్ పూర్తి కావాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో డీఆర్‌డీవో, డీఈవో అధికారులతో వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏకరూప దుస్తుల స్టిచ్చింగ్‌పై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దుస్తులను కుట్టడానికి డీఆర్‌డీవో ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాలకు పని అప్పగించాలన్నారు. 1142 పాఠశాలల్లోని 67,178(32238 బాలురు, 34940 బాలికల) మంది వద్ద తీసుకున్న కొలతల ఆధారంగా స్టిచ్చింగ్ చేయాలన్నారు. జూన్‌లోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీపీ సాయన్న పాల్గొన్నారు.



కోతుల్‌గాంలో విద్యుత్ తీగలకు తగిలేలా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ధాన్యం లారీ

## ఓవర్ లోడ్‌తో షార్ట్ సర్క్యూట్

*కోతుల్‌గాం లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఓవర్ లోడ్‌తో రైస్ మిల్లులకు వెళ్తున్న లారీలను బుధవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. అధిక లోడ్‌తో వెళ్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో షార్ట్ సర్క్యూట్ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లలోని టీవీ, ఫ్రిడ్జ్, కూలర్లు కాలిపోతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ తీగలు తెగిపడి మనుషులపై పడితే ఎవరు బాధ్యులని లారీ డ్రైవర్లను నిలదీశారు. అధికారులు స్పందించి ఓవర్ లోడుతో లారీలు గ్రామం నుంచి వెళ్లకుండా చూడాలని కోరుతున్నారు. - భైంసా టౌన్, మే 29*

# చేప పిల్లల పంపిణీ ఉన్నట్టా? లేనట్టా?

## అయోమయంలో మత్స్యకారులు

- వానకాలం సమీపిస్తున్నా సిద్ధం కాని ప్రణాళికలు
- మత్స్యకారులను ఆదుకునేందుకు కేసీఆర్ హయాంలో ఉచితంగా పంపిణీ
- సబ్సిడీపై వాహనాలు, వలలు అందజేత
- గతేడాది ఇప్పటికే పూర్తయిన టెండర్ ప్రక్రియ
- కాంగ్రెస్ ప్రభుత్వంలో పథకం అమలుపై అనుమానాలు



నిర్మల్, మే 29(నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వం మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఉచితంగా చేపపిల్లల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. దాదాపు ఎనిమిదేండ్లపాటు యేటా వానకాలం ప్రారంభానికి ముందే చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను వదలడానికి ప్రణాళికలు రూపొందించే వారు. మే నెల చివరి నాటికి టెండరు ప్రక్రియ కూడా పూర్తి చేసి.. జూన్, జూలై మాసాల్లో చెరువుల్లోకి కొత్తనీరు చేరగానే వదిలేవారు. కాగా.. ఈ యేడు చేపపిల్లల పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా పంపిణీపై మాట కూడా లేదు. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకపోవడంతో అధికారులు కార్యాచరణ రూపొందించలేదు. ఈసారి చేపపిల్లల పంపిణీ ఉంటుందా? ఉండదా? అన్న అయోమయంలో మత్స్యకారులు ఉన్నారు. నిర్మల్ జిల్లాలో 214 మత్స్యకార సంఘాలు ఉండగా 13,300 మంది సభ్యులు ఉన్నారు. 19 మండలాల పరిధిలో 644 చెరువులు ఉన్నాయి. వీటితోపాటు ఎస్సారెస్పీ, కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా రిజర్వాయర్లు, చెరువుల్లో గతేడాది వర్షాకాలంలో 4.75 కోట్ల ఉచిత చేప పిల్లలను విడుదల చేయాలని మత్స్య శాఖ అధికారులు ప్రతిపాదించారు. వీటికి అప్పటి ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ఆ మేరకు చేప పిల్లలను సరఫరా చేసే కాంట్రాక్టర్ల కోసం మే నెలలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి జూలై, ఆగస్టు మాసాల్లో చేప పిల్లలను చెరువులు, రిజర్వాయర్లలో విడుదల చేసింది. కాగా.. పెంచిన చేపలను మార్కెట్‌కు తరలించి విక్రయించేందుకు వాహనాలు, వలలను సబ్సిడీపై అందజేసి కేసీఆర్ ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలిచింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు చేప పిల్లల పంపిణీపై ఊసెత్తక పోవడంతో మత్స్యకారులు మండిపడుతున్నారు. అయితే ఈ విషయమై జిల్లా అధికారులను సంప్రదించగా.. పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జూన్ 4 తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే టెండర్ ప్రక్రియను పూర్తి చేయకపోతే ఈ సంవత్సరం ఉచిత చేపపిల్లల పంపిణీ ఉండదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

### కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు..



మత్స్యకారుల సమస్యలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వర్షాకాలం ప్రారంభమవుతున్నా.. ఇంతవరకు చేప పిల్లల కోసం టెండర్లు పిలువ లేదు. మత్స్యకార శాఖకు ఇంతవరకు మంత్రి కూడా లేడు. తమకు రావాల్సిన సబ్సిడీలు, ఇతర బెనిఫిట్స్ ఏవీ కూడా రావడం లేదు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా గంగ పుత్రులను ఇంతగా నిర్లక్ష్యం చేయలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో చేపల సీడ్ కోసం మార్చి నెల నుండే టెండర్లను పిలిచి మే నెలాఖరు వరకు పూర్తి చేసేవారు. జూన్ నుంచి ఆగస్టు లోపు సీడ్ కూడా పంపిణీ జరిగి చెరువుల్లో వదిలేవారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చేపపిల్లల పంపిణీకి చర్యలు తీసుకోవాలి.

*- జింకసూరి, మత్స్యకార సంఘం నాయకుడు, నిర్మల్.*



అధికారులతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

# ఒకటి నుంచి నూతన చట్టాలు అమలు

### ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, మే 29 : దేశవ్యాప్తంగా జూలై 1వ తేదీ నుంచి నూతన చట్టాలు అమలు కానున్న నేపథ్యంలో జిల్లా పోలీసులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. బుధవారం స్థానిక ఏఆర్ హెడ్‌క్వార్టర్ సమావేశ మందిరంలో హైదరాబాద్ నుంచి శిక్షణ తీసుకుని వచ్చిన వారు జిల్లా కేంద్రంలోని సిబ్బందికి శిక్షణను అందించే కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. కొత్తగా రూపొందించిన మూడు నూతన చట్టాలు (భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం 2023) రానున్న జూలై 1,2024 నుంచి అమలులోకి రానున్నాయన్నారు. జిల్లా పోలీసులందరికీ విడుతలవారీగా నూతన చట్టాలపై శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ సురేందర్‌రావు, డీఎస్పీలు సురేందర్‌రెడ్డి, హసీబుల్లా, సీఐలు రమేశ్, ఏ.రమాకాంత్, ఫణీధర్, జి.మొగిలి పాల్గొన్నారు.

# విత్తనాలను సరఫరా చేయాలి



సీఎస్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

నేరడిగొండ, మే 29 : పత్తి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్ సచివాలయంలో బుధవారం చీఫ్ సెక్రెటరీ శాంతికుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని, దీనికిగాను 11 లక్షల పైచిలుకు పత్తి విత్తన సంచులు అవసరమవుతాయని, ఇందులో ప్రధానంగా రాశి కంపెనీకి చెందిన ఆర్సీహెచ్ 659 రకాన్ని వేయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఆదిలాబాద్ నేలల స్వభావానికి ఈ వంగడం అనుకూలంగా ఉంటుందన్నారు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను తట్టుకుని రైతులకు అధిక దిగుబడి వస్తుందని, రైతులంతా ఈ రకం అధికంగా వాడుతారన్నారు. ఇదే అదునుగా భావించి ఆదిలాబాద్‌లోని డీలర్లు రైతులు ఇష్టపడని వంగడాలను అంటగట్టడానికి సిండికేట్‌గా మారి ఇబ్బంది పెడుతున్నారన్నారు. చొరవ తీసుకుని రాశీ సీడ్స్ కంపెనీ వారితో మాట్లాడి 2.50 లక్షల పత్తి బ్యాగులను యుద్ధ ప్రాతిపదికన ఆదిలాబాద్ జిల్లాకు సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. లేని పక్షంలో రైతులు ఆందోళనకు దిగే అవకాశం ఉందని అన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో ఎస్పీ, పోలీసు అధికారులు

# పోలీసులకు అభినందనలు

### నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ చైన్‌గేట్, మే 29 : ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలను జిల్లా పోలీసులు విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. నిర్మల్ పట్టణంలోని సిటి కన్వెన్షన్ హాల్‌లో భైంసా డివిజన్, నిర్మల్ సబ్ డివిజన్ పోలీసు సిబ్బందితో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో అధికారులు, సిబ్బంది శ్రమించిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఎస్పీ గంగారెడ్డి, ఏవో యూసుఫ్ అలీ పాల్గొన్నారు.



రైతులు, డీలర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

# విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

- ఇబ్బందులు కలుగకుండా చూడాలి
- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- విత్తన దుకాణాల తనిఖీ

ఎదులాపురం, మే 29 : పత్తి విత్తనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం పట్టణంలోని విత్తనాల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాశీ 659 రకం కోసం రైతులు ఉదయం నుంచే బారులు తీరుతున్నారనే విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. షాపులకు వచ్చిన స్టాక్, రైతులకు విక్రయించిన వివరాలను డీలర్లను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రైతులకు ఒకే రకమైన పత్తి విత్తనాలు కాకుండా ప్రభుత్వం గుర్తింపు ఉన్న విత్తనాలను వాడాలని సూచించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఒకే రకమైన పత్తి విత్తనాలను అడగడం, చుట్టూ పక్కల మండలాల్లో దుకాణాలు ఉన్నా.. గతేడాది తీసుకున్న దుకాణాల్లోనే కొనుగోలు చేసేందుకు వస్తున్నారన్నారు. దీని కారణంగా రద్దీ పెరుగుతుందన్నారు. ఎండల నేపథ్యంలో షాపుల వద్ద తాగునీరు సౌకర్యాలు కల్పిస్తామని, టెంట్లు కూడా వేస్తామన్నారు. ఈ సంవత్సరం 4 లక్షల ఎకరాల వరకు పత్తి సాగయ్యే అవకాశాలున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసిందన్నారు. తగ్గట్లుగానే 55 కంపెనీలతో మాట్లాడి 125 రకాల పత్తి విత్తనాలను 10 లక్షల ప్యాకెట్లు అవసరం ఉండగా.. ఎనిమిది లక్షల వరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగతావి ఈనెల చివరి వరకు వస్తాయన్నారు. రైతులు అధైర్య పడొద్దని సూచించారు. ఎండల కారణంగా దుకాణాలు కూడా ఉదయం 7 గంటలకే తెరిచేలా డీలర్లతో సమావేశం నిర్వహించి ఆదేశాలు ఇస్తామన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య ఉన్నారు.

### దుకాణాలను పరిశీలించిన ఎస్పీ



విత్తనాల షాపులను పరిశీలిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

ఆదిలాబాద్‌లోని గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్ మధ్యలో గల విత్తనాల షాపులను ఎస్పీ గౌష్ ఆలం బుధవారం పరిశీలించారు. విత్తనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. షాపుల వద్ద క్యూలైన్‌లను దృష్టిలో పెట్టుకుని బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని షాపుల వద్ద సరైన క్రమబద్ధీకరణతో కూడిన వరుస క్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల అడ్డుకట్టకు బృందాలను ఏర్పాటు చేసి, తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో రెండ్రోరోజుల క్రితం పట్టణంలో రూ.19 లక్షల విలువ గల విత్తనాలను పట్టుకున్నామని తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ ఉన్నారు.